## క్లుప్తంగా

### నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుల్లలచెరువు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని రకాల భరోసా పింఛన్ల మొత్తం 7,760 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన ఇళ్ల పరిధిలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

దొనకొండ: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని, పలు శాఖల అధికారులు సమగ్ర సమాచారం తీసుకుని హాజరు కావాలని ఆమె కోరారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ

దర్శి: ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు స్టెప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సమన్వయకర్తలు ఎస్.వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న మానసిక ప్రవర్తనా లోపాలను సరిచేసి వారిలో ఆత్మ విశ్వాసం నింపి తద్వారా వారిని మంచి పౌరులుగా తీర్చి దిద్దాలన్నదే స్టెప్ లక్ష్యం అన్నారు. అందుకు ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులు కావాలని, అందుకోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఉన్న ధ్యాన మందిరంలో మూడు రోజుల పాటు జరుపుతామన్నారు. ఇందులో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనంతో పాటు మెటీరియల్, సర్టిఫికెట్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే ఉపాధ్యాయులు 93473 44924, 98489 78284 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

### ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

దర్శి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దర్శి ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు గతంలో మార్కాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై దర్శికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బి.సుందరరామయ్య డిస్టలరీకి బదిలీపై వెళ్లారు.

### పుల్లలచెరువు ఎంపీడీవోగా వసంతరావు నాయక్



ఎంపీడీవోను సన్మానిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు ఎంపీడీవోగా వసంతరావు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ను జిల్లా అధికారులు ఆయన్ను ఇక్కడ నియమించడంతో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీపీ కె.వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అందరి సమాకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

### అంకితభావంతో విధులు నిర్వహించిన శ్రీనివాసరావు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంపీడీఓ

పెద్దదోర్నాల: విధి నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహించి అందరి హృదయాల్లో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు నిలిచిపోయారని ఎంపీడీఓ నాసర్‌రెడ్డి కొనియాడారు. బదిలీపై యర్రగొండపాలెం వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు సన్మాన సభ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఆయన సేవలను కొనియాడారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్, ప్రసూనాదేవి, కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

త్రిపురాంతకం: కారు.. బైక్ ఢీకొట్టుకున్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని డీవీఎన్ కాలనీ ప్రాంతంలో సోమవారం జరిగింది. బైక్‌పై ఉన్న నందిగం అబ్రహం కాలు విరిగింది. క్షతగాత్రుడిది మండలంలోని అన్నసముద్రం గ్రామం. సమీపంలోని మిరప పంట వేసి సాగు చేస్తున్నాడు. పొలం వద్దకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ మేరకు ఎస్ఐ శివ బసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అధికారులు సమాచారం ఇవ్వడం లేదు

● సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మారం అసంతృప్తి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు, వేదికపై జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి

తాళ్లూరు (దర్శి): ప్రజాప్రతినిధులు అడిగిన సమాచారం అధికారులు ఇవ్వడం లేదని జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. అడిగిన వాటికి సరైన సమాధానం చెప్పడం లేదని జెడ్పీటీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే అధికారులు చెప్పకపోతే తమకెంత బాధగా ఉంటుందో ఆలోచించాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం అడిగిన అన్నీ చెప్పాల్సిందేనన్నారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే గోకులాలు కడుతున్నారని సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. తీర్మానాలు లేకుండా ఎటువంటి పనులు మంజూరు చేయడం లేదని అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశంలో అడిగిన ప్రశ్నలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమాధానం చెప్పలేదని ఎంపీపీ, జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు వచ్చినా కొందరు అధికారులు సమయానికి హాజరు కావడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులకు జవాబుదారీతనంగా అధికారులు ఉండాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కేజీఎస్ రాజు, డీటీ ఇమ్మానియేల్ రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యను పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందికరంగా ఉందని, పంచాయతీ అధికారులు వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. యర్రబాలెం గ్రామానికే కాకుండా ఎస్సీపాలెంలో కూడా ప్రజలు తాగటానికి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఎంపీడీఓకు వివరించారు. గతంలో జీఎస్ఎల్ఆర్ ట్యాంక్‌లకు నీరు సరఫరా చేసే వారని, నేడు ఆ ట్యాంక్‌కు వచ్చే పైపులైన్ కట్ చేశారని, పైపులైన్ శిథిలావస్థకు చేరటంతో ట్యాంకర్లకు నీరు ఎక్కటం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. 10 నెలల క్రితం మంచినీటి పైపులైన్ గ్రామ పంచాయతీ వారు తొలగించి సైడు కాలువలు నిర్మించారని, దీంతో ప్రజలు నీటికి ఇబ్బంది పడుతున్నారని, 40 రోజుల నుంచి డీప్‌బోర్ చెడిపోయినా మరమ్మతులు చేపట్టలేదని, మంచినీటి సమస్య యర్రబాలెం గ్రామానికి మూడు ప్రాంతాల్లో ఇబ్బందికరంగా ఉందని అంజయ్య ఎంపీడీఓకు వివరించారు. అనంతరం ర్యాలీ చేశారు.

స్పందించిన ఎంపీడీఓ నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టానని, విచారించి నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కర్నా హనుమయ్య, ఫ్రాన్సిస్, ప్రభాకర్, సుధాకర్, యర్రబాలెం గ్రామస్తులు దావీదు, గురవయ్య, అల్లూరయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

## ప్రగళ్లపాడులో పారిశుధ్యం అధ్వానం



ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగు

పెద్దారవీడు: మండలంలోని ప్రగళ్లపాడులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో రోడ్డుపై గుంతలు పడ్డాయి. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో మురుగు నీటి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగు నీరు ప్రదేశాల్లో అధికారులు బ్లీచింగ్, పెనాయిల్ చల్లిన పాపాన పోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి కాలువలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం మొదలు నుంచి చివరి వరకు దాదాపు 5 ఐదు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంది. ఇళ్ల ముందు దుర్వాసన వెదజల్లడంతో భోజనం చేయాలన్నా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసి ఇరువైపులా కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కల్తీ తవుడును పరిశీలించిన అధికారులు



కల్తీ తవుడును పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: పాడి రైతులకు నాణ్యమైన తవుడు అందుబాటు రేటులో సరఫరా చేస్తున్నట్లు నమ్మించి కల్తీ తవుడు సరఫరా చేయడంతో రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు తవుడు నుంచి నమూనాలు సేకరించారు. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన 50 మంది రైతులకు తవుడును తెలంగాణ నుంచి వచ్చిన వ్యాపారి నాణ్యమైన తవుడు సరఫరా చేస్తానని నమ్మబలికాడు. రెండు లక్షల రూపాయల విలువ చేసే తవుడు కొనుగోలు చేశారు రైతులు. ప్రతి రైతు నుంచి పదిహేను వందల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. తవుడులో కల్తీ జరిగిందని గుర్తించిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పశువైద్యాధికారులు శ్రీరాములు, సాంబశివరావు రైతుల వద్ద తవుడును పరిశీలించి శ్యాంపిల్స్ తీసి టెస్టింగ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

## జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు




కంపెనీ ప్రతినిధులతో ఉద్యోగాలు పొందిన యువకులు, యువతులు

దర్శి: స్థానిక ప్రభుత డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 42 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఏవీ కవిత తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా సోమవారం జాబ్‌మేళా నిర్వహించాయి. ప్రిన్సిపాల్ ఏవీ కవిత మాట్లాడుతూ మేళాలో అరబిందో ఫార్మాకు 9 మంది, డీమార్ట్‌కు 23 మంది, మాస్టర్ మైండ్స్‌కు 10 మందిని ఎంపిక చేశారు. మొత్తం 116 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. జాబ్‌మేళాలో 13 మందికి ఇంటర్న్ షిప్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

ఆయా సంస్థల ప్రతినిధులు వెంకట గణేష్, పోలయ్య, ఉజ్వల సంస్థల వివరాలు తెలియజేశారు. స్కిల్‌హబ్, జాబ్‌మేళా ట్రెనింగ్ కో ఆర్డినేటర్‌లు డాక్టర్ నగేష్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

## కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

పొదిలి: కూలీ పనులు చేసుకుని ట్రాక్టర్‌లో వస్తూ ప్రమాదానికి గురై గాయాలపాలైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. కాటూరివారిపాలెం వద్ద ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడటంతో గాయపడిన వారిని, కుటుంబ సభ్యులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ సోమవారం పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని కూడా పరామర్శించినట్లు తెలిపారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారని, మరో 13 మందికి స్వల్పంగా గాయలయ్యాయని, ఇటువంటి ప్రమాద సందర్భాల్లో బాధితులను ఆదుకునేందుకు ఎటువంటి రక్షణ చట్టం లేకపోవడం బాధాకరమన్నారు. కూలీల కుటుంబాలను ఆదుకునే పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పూర్తిగా కోలుకునేంత వరకు వైద్య సేవలు అందించాలన్నారు. సీఎం సహాయ నిధి నుంచి వీరి కుటుంబాలకు తోడ్పాటు అందించాలని కోరారు. సీపీఎం నేతల వెంట చాగంటి కోటేశ్వరరావు, కాటూరి అశోక్ తదితరులు ఉన్నారు.

### రేపు శ్రావణి హాస్పిటల్లో వైద్య శిబిరం

మార్కాపురం: అక్టోబరు 2న మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని శ్రావణి హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ విలేకరులకు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### నేడు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక కార్యదర్శి ఈశ్వర్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును గతనెల 25వ తేదిన నిర్వహించామని, అందులో మొదటి స్థానంలో నిలిచిన వారికి మంగళవారం మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### నేడు మద్యం దుకాణాల ఉద్యోగుల బంద్

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మద్యం దుకాణాల పనిచేస్తున్న సేల్స్ సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు బంద్‌లో పాల్గొననున్నట్లు సంఘ నాయకులు నందిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుమార్‌బాబు తెలిపారు. సోమవారం డిపో మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందించారు. తమను గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం షాపుల్లో పనిచేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి సేల్స్‌మెన్స్‌గా, సూపర్‌వైజర్లుగా 17 వేల మంది ఉద్యోగులను నియమించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రతపై ఎటువంటి హామీ ఇవ్వనందుకు నిరసనగా అక్టోబరు 1 నుంచి విధులకు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సుబ్బారావు, ఉస్మాన్, రామకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

## అధిక లోడ్‌తో ప్రయాణిస్తే జరిమానాలు

దర్శి: పరిమితికి మించి అధిక లోడ్‌తో ఎక్కువ మందిని ఎక్కించుకుని ఆటోల్లో ప్రయాణాలు కొనసాగిస్తే జరిమానాలు విధిస్తామని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. పట్టణంలోని కురిచేడు రోడ్డులో ఎంవీఐ రవికుమార్ ఆధ్వర్యంలో అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను ఆయన సోమవారం తనిఖీ చేసి జరిమానాలు వేశారు. మొత్తం 25 ఆటోలు తనిఖీ చేసి రూ.30 వేల జరిమానా విధించారు. రవికుమార్ మాట్లాడుతూ ఆటోలో డ్రైవర్‌కు ఇరువైపులా ఎవరూ కూర్చోకూడదన్నారు. వెనుక వైపు వేలాడి రావడం, కూలీలను ఎక్కువ మందిని ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ జె.సుందరరావు, దర్శి కంట్రోలర్ రామయ్య ఉన్నారు.



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

# కొత్త మద్యం పాలసీతో చేటు

● బజారున పడనున్న 17 వేల కుటుంబాలు



ప్రభుత్వ మద్యం దుకాణం

కురిచేడు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ఎందరో జీవితాలను మార్చుతుందని గంపెడాశతో ప్రజలు ఓట్లేసి గెలిపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలు ఆయన్ను నెత్తిన పెట్టుకున్నారు. అందుకు నిజంగా చంద్రబాబు అందరి జీవితాలు మార్చుతాడని భావించారు. సూపర్ సిక్స్ పథకాల మాటేమిటో గానీ సూపర్ స్పీడుతో నిర్ణయాలు మార్చి ప్రతి ఒక్కరి జీవితాల్లో చీకట్లు అలుముకునేలా చర్యలు ప్రారంభించారు. ఉచితాలను సముచితాలు చేసి అందినకాడికి దండుకున్నోడిదే రాజ్యం నిరూపిస్తున్నారు. తాజాగా వచ్చిన మద్యం పాలసీ 17 వేల కుటుంబాలను రోడ్డున పడేసింది. రాష్ట్రంలో 2,800 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి జగనన్న ప్రభుత్వం వాటి ద్వారా 16,800 మందికి ఉద్యోగాలు కల్పించారు. వారు గడిచిన ఐదేళ్లు వారి కుటుంబాలను పోషించుకున్నారు. వారికి జీవనోపాధి చూపకుండా రోడ్డున పడేసి అయినవారి కోసం ప్రైవేటు వ్యక్తులకు వేలం పాటల ద్వారా మద్యం దుకాణాలు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వారికి ఇవ్వాల్సిన బోనస్, పీఎఫ్ లాంటివి కూడా ఇవ్వకుండా గాలికి వదిలేసింది. దీంతో వారంతో నేటి నుంచి కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## బాలికల సంరక్షణపై అవగాహన



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్‌రావు

పుల్లలచెరువు: బాలికల సంరక్షణ, భద్రతపై బాలికలకు అవగాహన ఉండాలని యర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు అన్నారు. స్థానిక కెజీబీవీ పాఠశాలలో ఇంటర్, హైస్కూల్ బాలికలకు చట్టాలు, సంరక్షణ, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఇష్టంతో కష్టపడి చదువుకోవాలన్నారు. ముఖ్యంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఫొటోలు పోస్టు చేయడం, ఆన్‌లైన్‌లో పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడటం, చాటింగ్ చేయడం, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు వేయండి అని చెబితే నమ్మి వేయడం వంటివి చేయకూడదన్నారు. స్కూల్ బయట ఎవరైనా బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై ఫోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు చదువే ముఖ్యంగా ఉండాలని, చెడు వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను వింటూ ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి సంబరాలు



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పెద్దదోర్నాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు ఏనుగుల రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఇండియన్ హైస్కూల్లో చెకుముకి సైన్స్ సంబరాలు పరీక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ చిన్న పీరా ఆవిష్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రజల్లోని మూఢ విశ్వాసాలను పారద్రోలేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. ఇండియన్ హైస్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు చెకుముకి సంబరాలు వంటి పరీక్షల్లో పాల్గొంటే వారిలో సైన్స్ పట్ల ఆసక్తి కలుగుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు దగ్గుల రవీంద్రారెడ్డి, బొటుకు యల్లారావు, పాఠశాల ఉపాధ్యాయులు కంచర్ల రాఘవ, చల్లా బిందు, అరుణ, మంత్రునాయక్ పాల్గొన్నారు.

## భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి



భవిత కేంద్రంలో ఎంఈఓలు

త్రిపురాంతకం: ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంఈఓలు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీని వినియోగించుకుని విద్యార్థుల్లో స్థితిని మెరుగు పరిచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వైద్యాధికారి అంకారావు, ఐఆర్‌టీ బాల విజయ, సీఆర్‌పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పూర్ణచంద్రనాయక్



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

దర్శి: ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ దర్శి నియోజకవర్గ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేతావత్ పూర్ణ చంద్రనాయక్ నియమితులయ్యారు. ఒంగోలులో జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మొగిలి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు భుక్యా కృష్ణనాయక్, చేవూరి సునీత, ప్రధాన కార్యదర్శి ఇట్లా వెంకటేశ్వర్లు, కోశాధికారి భూక్యా వాసునాయక్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మూనపాటి నాగేశ్వరరావు, వాంకడవత్ శ్రీను నాయక్, దేవసొత్తు దేవరెడ్డి నాయక్, జాయింట్ సెక్రటరీలుగా దేవసోత్ మాన్సింగ్ నాయక్, బానావత్ గోపానాయక్, ఇండ్లపావని, వాంకుడవత్ లక్ష్మనాయక్, మోట శ్రీనివాసరావు, బాణావత్ చంద్రమోహన్‌నాయక్, ఒడిత్య రెడ్డినాయక్, జెశావత్తు మేఘనాయక్, శ్రీరామ్ పావని, ఒడిత్య బాలనాయక్, జున్ను రవి, ముడావత్ ప్రసాద్‌నాయక్, దేవరకొండ వెంకట్రావు, మేఘావత్ లక్ష్మనాయక్, కోనేటి శ్రీను, భూక్యారాజునాయక్, ఇట్టా మోహన్, కాకి ఆంజనేయులును ఎన్నుకున్నారు.